సాక్షి
అనకాపల్లి
ఆదివారం। 16। ఫిబ్రవరి। 2025



తోటల నరికివేత

8లో

క్వారీ లీజు పేరుతో చెట్లు తొలగించి, టీడీపీ అండతో కలప తరలిస్తుండగా పెదమదీనలో నాయకులు, గ్రామస్తులు అడ్డుకున్నారు.



సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



'మాస్టరింగ్' పుస్తకావిష్కరణ

విశాఖ విద్య: ఏయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు, డాక్టర్ శ్రీనివాసరావు రాసిన 'మాస్టరింగ్' పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

బాక్సింగ్‌లో మెడల్ సాధించిన హోంగార్డుకు సన్మానం



బాక్సర్ చక్రాంతి రోహిణిని సన్మానిస్తున్న సీఐ గోవిందరావు, వెలగా నారాయణరావు

నర్సీపట్నం: ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో నింజాస్ అకాడమీలో శిక్షణ పొందిన టౌన్ పోలీసు స్టేషన్ హోంగార్డు చక్రాంతి రోహిణి కాంస్య పతకం సాధించారు. ఆమెను టౌన్ సీఐ జి.గోవిందరావు, అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు శాలువాతో సత్కరించారు. ఆమెకు వెలగా నారాయణ రావు స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు. తమ డిపార్టుమెంట్‌లో పనిచూస్తూ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రాణించటం అభినందనీయమన్నారు. జాతీయస్థాయిలో రాణించాలని కాంక్షించారు. సన్మానించిన వారిలో కోచ్‌లు అబ్బు, శేఖర్ ఉన్నారు.

'గాదె'కు వ్యాయామ ఉపాధ్యాయుల మద్దతు



వ్యాయామ ఉపాధ్యాయుల సంఘీభావం

విశాఖ విద్య: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడుకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ నాయకులు వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా కమిటీల సమావేశం శనివారం రాత్రి పెందుర్తి సుజాతానగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. రాష్ట్ర అసోసియేషన్ సలహాదారు సుందరరావు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన ఉన్న గాదె శ్రీనివాసులు నాయుడుకు ఉత్తరాంధ్రలోని వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా కమిటీలన్నీ ఏకగ్రీవంగా సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అప్పలరాజు, ఎన్.లలిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఆరు జిల్లాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తనకు అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారం కోసం శాసనమండలి వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎస్‌టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు మాట్లాడారు.

అర్చకుడు పేరూరి చిన్నిస్వామికి స్వామి వివేకానంద అవార్డు

అనకాపల్లి టౌన్: స్థానిక భోగలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పేరూరి చిన్నిస్వామి స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. దేవతామూర్తుల అలంకరణ విభాగంలో ఈ పురస్కారం అందిస్తున్నట్లు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ (హైదరాబాద్) శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 16న చిన్నిస్వామి హైదరాబాద్‌లో ఈ అవార్డును అందుకోనున్నారని, గత 27 సంవత్సరాలుగా స్వయంభూ భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా సేవ చేసినందుకు ఈ అవార్డు వచ్చిందని ఆలయ సిబ్బంది తెలిపారు.

ఇంకుడు గుంతలకు ప్రభుత్వ ప్రోత్సాహం



కె.కోటపాడులో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో మురుగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని డ్వామా పీడీ పూర్ణిమాదేవి అన్నారు. కె.కోటపాడు గ్రామంలో శనివారం ఇంకుడు గుంతల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఇంకుడు గుంతల వాడకం వలన భూగర్భ జలాలు మెరుగు పడనున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టుకునే వారికి రూ.6,500లు ఇవ్వనున్నట్లు పూర్ణిమాదేవి చెప్పారు. అనంతరం కె.సంతపాలెం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువు తయారీని చేపట్టి రైతులకు తక్కువ ధరకే అందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఏపీడీ బి.శ్రీనివాసరావు, ఏపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు చౌకగా భూములు సేకరించి, వాటిని అధిక ధరలకు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నంలో.. కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం తలపెడుతోంది. కొత్త కుట్రకు తెరలేపింది. కంపెనీలు స్థాపించడం కోసం రైతుల నుంచి భూములు సేకరించాల్సి వస్తే నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి అందుకు ఉపక్రమించాలి. కానీ అలా చేస్తే పరిహారంతోపాటు, ప్రత్యేక ప్యాకేజీ ఇతర సదుపాయాలు వర్తింపజేయాలన్న ఉద్దేశంతో డైరెక్ట్ పర్చేజింగ్ విధానాన్ని తెర మీదకు తెచ్చింది. ఈ విధానం ద్వారా వందలాది ఎకరాలు రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించి వారికి నష్టపరిహారం మాత్రమే చెల్లించి ఇతర సదుపాయాలు వర్తింపజేయకుండా భూములు లాక్కోవాలని ప్రయత్నిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం నక్కపల్లి మండలంలో బోదిగల్లం, కాగిత, వేంపాడు, అమలాపురం, న్యాయంపూడి గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల భూముల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం ఇదే విధానాన్ని అమలు చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



కాగిత సమీపంలో రోడ్డు నిర్మాణం కోసం సేకరిస్తున్న భూములు

రైతన్నా.. బహుపరాక్

అడ్డదారిలో భూ సేకరణ



బోదిగల్లంలో భూములు రిజిస్ట్రేషన్ జరుగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం రైతులతో నేరుగా మంతనాలు జరుపుతున్న అధికారులు (ఫైల్)

నక్కపల్లి: రాజయ్యపేట, చందనాడ, బోయపాడు, అమలాపురం గ్రామాల సమీపంలో ప్రభుత్వం బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తోంది. గతంలో రైతుల నుంచి సేకరించిన 4500 ఎకరాల్లో 2 వేల ఎకరాలను ఈ పార్క్ కోసం కేటాయించారు. పార్క్ నిర్మాణానికి గత నెలలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయడంతో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఈ పార్క్ నిర్మాణంలో భాగంగా పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట, రాజయ్యపేటలో కొంత నివాస ప్రాంతాలను ఖాళీ చేయించాల్సి ఉంది. ఏపీఐఐసీకి భూములు, నివాస ప్రాంతాలను ఇచ్చిన వారికి వేరొక చోట పునరావాసం కల్పించాలి. ఇలా బల్క్ డ్రగ్ పార్క్ ప్రభావిత ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందికి వేరొక చోట ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలి. వీరికి పునరావాసం కోసం పెదబోదిగల్లంలో సుమారు 170 ఎకరాలను గుర్తించారు. ఈ భూములను ప్రభుత్వం డైరెక్ట్ పర్చేజింగ్ పేరుతో కొనుగోలు చేస్తోంది. కంపెనీ అవసరాలు, నిర్వాసితులకు పునరావాసం కోసం భూములు తీసుకోదలిస్తే ముందుగా 4 (1) నోటిఫికేషన్ విడుదల చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 2013 భూసేకరణ చట్టం ప్రకారం మద్దతు ధర నిర్ణయించి, అక్కడ ఉన్న మార్కెట్ విలువకు మూడు నుంచి ఐదు రెట్లు అధికంగా నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం, మేజర్లకు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. రైతుల ఆమోదంతో అవార్డు పాస్ చేయాలి. ఇవన్నీ చేయాలంటే బోదిగల్లంలో రైతులకు ఎకరాకు సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు ముట్టజెప్పాల్సి ఉంటుంది. కాని ప్రభుత్వం రైతులకు అన్యాయం తలపెడుతూ వారితో నేరుగా బేరసారాలు సాగించి ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ధరకు మీరు భూములు ఇస్తే సరే సరి.. లేకపోతే బలవంతంగా భూములు తీసేసుకుని నష్టపరిహారం కోర్టులో జమ చేస్తామని బెదిరించడంతో గత్యంతరం లేక కొంతమంది రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించారు. 170 ఎకరాలకు గాను సుమారు 80 ఎకరాలకు సంబంధించి రైతులు తమ అంగీకారం తెలపగా, దాదాపు 25 ఎకరాలకు పైగా భూములను ప్రభుత్వం రైతులకు నేరుగా నష్టపరిహారం చెల్లించి ఏపీఐఐసీ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుంది. మిగిలిన భూములను రైతులు ఇవ్వాలా వద్దా అనే ఆలోచనలో పడ్డారు. వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్టు సమాచారం. కేవలం పరిహారం మాత్రమే చెల్లించి ప్యాకేజీ ఇతర సదుపాయాలు కల్పించకుండా భూములు ఇవ్వాలని ఒత్తిడి చేయడం అన్యాయమంటూ కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారంతో సరిపెట్టేశారు..



మా గ్రామంలో రోడ్డు నిర్మాణం కోసం సేకరించే జిరాయితీ భూములకు నోటిఫికేషన్ ఇచ్చారు. పరిహారం విషయంలో రైతులు వెనక్కి తగ్గకపోవడంతో మూడు పర్యాయాలు కలెక్టర్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించి ఎట్టకేలకు రూ.60 లక్షల చొప్పున చెల్లించేందుకు అంగీకరించడంతో ఒప్పుకున్నాం. అదే సమయంలో ఆర్ కార్డులు ఇవ్వాలని కోరితే పట్టించుకోలేదు. అలాగే చెట్లకు, బోర్లకు, బావులకు పరిహారం చెల్లించలేదు. ఇక్కడ ఏర్పాటు చేసే కంపెనీల్లో నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశాం. దాని గురించి మాట్లాడటం లేదు. భూములు ఇచ్చిన రైతులకు చిన్న చిన్న కాంట్రాక్టు పనులు ఇస్తామని చెప్పారు. ఇప్పుడు వాటి గురించి మాట్లాడటం లేదు. రాతపూర్వక హామీలు ఇవ్వడంలేదు. కేవలం పరిహారంతోనే సరిపెట్టేశారు. అలాగే రోడ్డు కోసం న్యాయంపూడి, కాగిత, గ్రామాల్లో సేకరించే 20 ఎకరాల డీఫారం ప్రభుత్వ భూములకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఎక్కువ మంది దళితులు ఉన్నారు. నేరుగా రైతులతో మంతనాలు సాగిస్తున్నారు. పరిహారం విషయంలో దళితులకు అన్యాయం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిరాయితీతో సమానంగా వారికి కూడా పరిహారం ఇవ్వాల్సిందే.

–డి.శివ, రైతు, కాగిత

నాలుగులైన్ల రోడ్ల నిర్మాణానికీ అదే పరిస్థితి

ఏపీఐఐసీ వారు ఏర్పాటు చేసే ప్రత్యేక ఆర్థిక మండలి, బల్క్‌డ్రగ్‌పార్క్ కోసం జాతీయరహదారి కాగిత నుంచి వేంపాడు, అమలాపురం మీదుగా బోయపాడు వరకు నాలుగు లైన్ల (150 అడుగుల) రహదారిని నిర్మించాల్సి ఉంది. దీని కోసం సుమారు 60 ఎకరాల భూములు అవసరం. కాగితలో జిరాయితీ భూములకు రూ.60 లక్షల చొప్పున డైరెక్ట్ పర్చేజింగ్ విధానంలో కొనుగోలు చేసి నష్టపరిహారం చెల్లించారు. వీరి భూముల్లో ఉన్న ఫలసాయానికి ఎటువంటి పరిహారం చెల్లించలేదు. మామిడి, జీడి, కొబ్బరి చెట్లకు సంబంధించిన పరిహారం ఇంతవరకు ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. ఇక ఇక్కడ డీఫారం, ప్రభుత్వ భూములు కలిపి సుమారు 20 ఎకరాలు ఉంది. కాగితలో మార్కెట్ విలువ రూ.12 లక్షలు, న్యాయంపూడిలో రూ.18 లక్షలు, వేంపాడులో రూ.18 లక్షలు ఉందని అధికారులు చెబుతున్నారు. డీఫారం రైతులకు ఎకరాకు రూ.30 లక్షలు, సాగు భూములకు ఎకరాకు రూ.12 లక్షలు చెల్లిస్తామని చెబుతున్నారు. రైతులు మాత్రం డీఫారం రైతులకు కూడా జిరాయితీతో సమానంగా రూ.60 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రూ.30 లక్షల కంటే ఎక్కువ ఇచ్చేది లేదని, పరిహారం కోర్టులో జమ చేస్తామని అధికారులు బెదిరిస్తున్నారంటూ రైతులు వాపోతున్నారు. ఇక్కడ కూడా భూసేకరణ నోటిఫికేషన్ లేకుండానే భూములు తీసుకోవడం గమనార్హం. ఇలా డైరెక్ట్ పర్చేజింగ్ విధానంలో అయితే రైతులు కేవలం నష్టపరిహారంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. కంపెనీల అవసరాలు, పునరావాసం కోసం సేకరించే భూములకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, రైతులకు అన్యాయం తలపెడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శాస్త్రీయ పద్ధతిలో చెత్త సేకరణ

- పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు
- స్వచ్ఛ దివస్‌లో కలెక్టర్ విజయ కృష్ణన్



తుమ్మపాలలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: చెత్త సేకరణను ఆషామాషీగా తీసుకోవద్దని, ఈ ప్రక్రియ శాస్త్రీయ పద్ధతిలో జరగాలని, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. తుమ్మపాల గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో తడి చెత్తను, పొడి చెత్తను విడదీసే విధానంపై అధికారులు స్థానికులకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విషయంలో ప్రజలకు తగిన అవగాహన చేయాలన్నారు. ఇంటిని, పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో స్థానికుల సహకారం ఉండాలని, వారు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి రోడ్డుపై చెత్తకుప్పలు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దుకాణదారులు, హోటళ్ల వారు చెత్తను డస్ట్‌బిన్‌లలో వేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని, వ్యాపార సంస్థలను మూసివేయిస్తామని హెచ్చరించారు. వారం రోజులలో గ్రామంలో మొత్తం చెత్తకుప్పలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో షేక్ ఆయిషా, ఎస్డీసీ, మండల ప్రత్యేకాధికారి సుబ్బలక్ష్మి, డీపీవో ఆర్.శిరీషరాణి, జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజుకుమార్, ఎంపీడీవో కె.వి.నర్సింహరావు, గ్రామ వార్డు సచివాలయ అధికారి నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ దేవప్రసాద్

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు వచ్చే సమయంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత అని అన్నారు. గృహాల్లోను, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో చెత్త బుట్టలను ఏర్పాటు చేసి చెత్తను అక్కడ మాత్రమే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏవో రామ్‌కుమార్, సీఐ టి.లక్ష్మి, ఎస్‌ఐలు సురేష్‌బాబు, వెంకన్న, కామేశ్వరరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌తో పునర్జన్మ



హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పోలీసులు, ఇతర వాహనదారులు

- జాగ్రత్తలతో సురక్షిత ప్రయాణం
- కుటుంబానికి అన్యాయం చేయొద్దు
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎస్పీ

అనకాపల్లి: తల్లి జన్మనిస్తే, హెల్మెట్ పునర్జన్మనిస్తుందని.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారి మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం జెండా ఊపి ద్విచక్ర వాహనాల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2024 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల వల్ల 313 మంది మృత్యువాత పడ్డారని, 734 మంది గాయాలపాలయ్యారని, మీ అజాగ్రత్త వల్ల కుటుంబానికి అన్యాయం చేయవద్దని ఆయన చెప్పారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారే అధికంగా మృత్యువాత పడినట్లు ఆయన పేర్కొన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్, సాగర్ సిమెంట్ వారి సీఎస్సార్ నిధుల నుంచి 75 స్టాపర్ బోర్డులను ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణ హోండా షోరూం యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి 30మంది పోలీస్ సిబ్బందికి ఎస్పీ ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఆర్డీవో జి.మనోహర్, డీఎస్పీ ఎం.శ్రావణి, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ట్రాఫిక్ సీఐ టి.వి.విజయకుమార్, ట్రైనీ డీఎస్పీ ఎం.వి.కె.చైతన్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం పీఈటీపై వేటు

- విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఫలితం
- చోద్యం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

గొలుగొండ: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టు వచ్చిన ఆరోపణలు ప్రాథమికంగా రుజువు కావడంతో చోద్యం జెడ్పీ హైస్కూల్లో పార్ట్‌టైం పీఈటీగా పనిచేస్తున్న కుందూరి నూకరాజును విధుల నుంచి పూర్తిగా తొలగించారు. ఈమేరకు డీఈవో జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడు శనివారం ఉత్తర్వులిచ్చారు. విద్యార్థుల బాధ్యత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు ఇస్తున్నట్లు చెప్పారు.

డీఈవో విచారణ

గత నెల 28న క్రీడా పోటీల కోసం పది మంది విద్యార్థులను పీఈటీ నూకరాజు తమిళనాడు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వచ్చే సమయంలో విద్యార్థినుల పట్ల ఆయన అసభ్యకరంగా ప్రవర్తించాడని శుక్రవారం వారి తల్లిదండ్రులతో కలిసి ఎంఈవోకు ఫిర్యాదులు చేసిన విషయం విదితమే. దీనిపై డీఈవో అప్పారావునాయుడు శనివారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయినుల నుంచి వివరాలు సేకరించారు. తర్వాత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వివరాలు తీసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంఈవోలు సత్యనారాయణ, ఏపీఎస్‌ఎస్ మూర్తి పాల్గొన్నారు.



విధుల నుంచి తొలగించిన పీఈటీ నూకరాజు



ఉపాధ్యాయినుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

సలాం.. బేగం



క్యాన్సర్‌ను ఓడించిన ఫిట్‌నెస్ ట్రైనర్

ఓటమిని అంగీకరించని ఫర్జానా బేగం

ఎన్ని మేఘాలొచ్చినా..ఆకాశం కదలదు..ఎన్ని తుఫానులైనా..సముద్రం నిలిచిపోదు.. ఎదురయ్యే బాధలన్నీ..ఎగసి పడే తరంగాలే..ఆపదల గాలి ఎంత వేగంగా వీచినా, దృఢమైన మనసు చలించదు. కోల్పోయినవేమీ కన్నీటి కథలవ్వవు..ఎలాంటి కష్టాలు ఎదురొచ్చినా ధైర్యం చేతిలో తలవంచక తప్పదు..నీ ధైర్యమే నీ గెలుపు పతాకం.. తట్టుకొనే శక్తి ముందు, ఏ గెలుపైనా తక్కువే. వాడిపోయిన పువ్వుల్లా రాలిపోతాయి..కష్టానికి పూచే పూలే నిజమైన..విజయాలై వికసిస్తాయి. అచ్చం ఫర్జానా బేగంలా..క్యాన్సర్ వచ్చిందని ఆమె కుంగిపోలేదు. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసింది. ఆమె సంకల్పం ముందు క్యాన్సర్ ఓడిపోయింది.

– ఏయూక్యాంపస్

ఆనందంగా..ఆరోగ్యకరంగా సాగుతున్న జీవితం. శారీరక వ్యాయామ, పోషకాహార నిపుణురాలిగా అందరికీ సూచనలిచ్చే వ్యక్తి. ఇద్దరు కుమార్తెలతో సంతోషంగా సాగుతున్న కుటుంబం. ఒక్కసారిగా ఆమె శరీరంలోకి క్యాన్సర్ మహమ్మారి ప్రవేశించింది. భయపడిన ఆమె వైద్యులు చెప్పిన మాట విని అంతలోనే తేరుకుంది. మనోధైర్యాన్ని సడలనివ్వలేదు. క్యాన్సర్‌ను ధైర్యంగా ఎదుర్కొంది. వైద్యుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగింది. కాన్సర్ బారిన పడి దానిని అధిగమించి నూతన జీవితాన్ని పొందాలనేవారికి స్ఫూర్తిగా నిలిచారు..నగరానికి చెందిన ఫిట్‌నెస్ ట్రైనర్ ఫర్జానా బేగం.





ఆనందంగా సాగుతున్న జీవితంలో..

గృహిణిగా తన కుటుంబాన్ని, సొంత ఫిట్‌నెస్ సెంటర్‌ను నిర్వహిస్తూ ఆనందంగా సాగుతున్న బేగం జీవితంలో 2017 నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి. షోల్డర్ పెయిన్‌తో వైద్యుల వద్దకు వెళ్లిన ఆమె ఎంఆర్‌ఐ లో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. ఆ ట్యూమర్ రిబ్స్‌లోని వెళ్లినట్లు వైద్యులు గుర్తించారు. వైద్యులు సర్జరీ చేశారు. అనంతరం 2019లో తిరిగి తీవ్రమైన ఛాతీ నొప్పితో ఆస్పత్రిలో చేరారు. ఆమె ఛాతీ పక్కటెముకలు రెండూ ట్యూమర్ కారణంగా పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులుగుర్తించారు. వైద్యులు బయాప్సీ చేసి క్యాన్సర్‌గా నిర్ధారించారు.

ధైర్యం కోల్పోలేదు

తొలుత కాస్త భయపడినా కొద్దిరోజుల్లోనే ఆత్మస్థైర్యంతో ధైర్యంగా చికిత్సకు వెళ్లారు. కిమో థెరపీ తీసుకున్నారు. కిమో థెరపీ పర్యవసనాలు ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలను చవిచూశారు. వాటన్నింటినీ భరిస్తూ, అధిగమిస్తూ పూర్తిస్థాయిలో చికిత్స తీసుకున్నారు. మనసునిండా మనోబలం, దైవంపై నమ్మకంతో చికిత్సకు సానుకూల ఆలోచనలతో వెళ్లారు. అదే సమయంలో తనకు సంబంధించిన ఫిట్‌నెస్ జిమ్‌లో తన వృత్తిని యథావిధిగా కొనసాగించారు.



కష్టం వచ్చినప్పుడు పోరాడాలి

ఇద్దరు కుమార్తెలకు తాను ఒక ఉదాహరణగా నిలవాలని ఫర్జానా నిర్ణయించుకున్నారు. కష్టం వచ్చినపుడు పోరాడాలని, ఎప్పుడూ వెనకడుగు వెయ్యకూడదని భావించి, ఆచరణలో చూపారు. సమస్యలు జీవితంలో నిత్యం వస్తుంటాయని, పోరాటం మానకూడదంటారు ఫర్జానా. నేను గెలవాలి అనే బలమైన ఆకాంక్ష సంపూర్ణ ఆరోగ్యంతో తయారయ్యేలా చేసిందన్నారు. నేడు ఎందరో క్యాన్సర్ బాధితులకు ఆమె జీవితం ఒక స్ఫూర్తిదాయక పాఠం. ఇటీవల ఆమె బాలకృష్ణ నిర్వహించే అన్‌స్టాపబుల్ షోలో కూడా పాల్గొని తన జీవిత ప్రయాణాన్ని, క్యాన్సర్‌ను జయించిన విధానాన్ని ప్రజలతో పంచుకున్నారు.

వారే నా ధైర్యం

క్యాన్సర్ వచ్చిందని తెలిసిన సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, తన వద్ద శిక్షణ తీసుకున్న ఫిట్‌నెస్ ట్రైనర్లు అందించిన మానసిక స్థైర్యం వ్యాధి నుంచి త్వరగా కోలుకొనేలా చేసింది. మానసిక ఆరోగ్యం దెబ్బ తినకుండా, మనోధైర్యం కోల్పోకుండా ముందుకు సాగడం వలనే త్వరగా కోలుకోవడం సాధ్యపడింది. అదే సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది అందించిన స్థైర్యం మరవలేనిదని ఆమె చెప్పారు. చికిత్స సమయంలో రోజుకో విధంగా శరీరం స్పందించడం, అనేక సందేహాలు రావడం జరిగేది. వీటిని వైద్యులకు వివరిస్తూ వారి సూచనలను స్వీకరిస్తూ ముందుకు సాగారు.

పెదమదీనలో అకేషియా తోటల నరికివేత

- క్వారీ లీజు పేరుతో చెట్ల తొలగింపు
- అడ్డుకున్న నాయకులు, గ్రామస్తులు
- టీడీపీ అండతో కలప తరలింపు

బుచ్చెయ్యపేట: మండలంలోని పెదమదీన గ్రామంలో అకేషియా చెట్లను అక్రమంగా నరికి ట్రాక్టర్లతో తరలిస్తుండగా గ్రామస్తులు, నాయకులు అడ్డుకున్నారు. ఇక్కడ రంగురాళ్ల క్వారీకి లీజుకు తీసుకున్న భూమిలో పదేళ్లుగా ఎటువంటి పనులు చేపట్టలేదు. ఇప్పుడు క్వారీ లీజు పేరుతో కొండను ఆనుకుని ఏపుగా పెరిగిన అకేషియా చెట్లను నరికి తరలించడాన్ని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తదతరులు అడ్డుకున్నారు. కలపతో ఉన్న ట్రాక్టర్లను గ్రామ రామాలయం వద్దకు తరలించారు. కలప తరలింపునకు ఎవరు అనుమతిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2013లో గ్రామంలో సర్వే నంబర్ 75, 81లో 75 ఎకరాల భూమిని బీలా శ్రీనివాసరావు పేరు మీద రంగురాళ్ల క్వారీకి లీజుకు ఇచ్చారు. అప్పటి విశాఖ జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ వసంతకుమారి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అయితే కొంత మంది రైతులు వ్యతిరేకించినా క్వారీకి అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి క్వారీ నిర్వహణ చేపట్టలేదు. ప్రభుత్వానికి రాయల్టీని కట్టకుండా అక్రమంగా లీజుదారుడు పంచాయతీ అనుమతి లేకుండా చెట్లు నరికి తరలిస్తున్నారని సర్పంచ్ భర్త కేవీఆర్ నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జనసేన నాయకుడు కొళ్లమల్ల నాగేశ్వరరావు, బీజేపీ నాయకుడు కోన హేమంత్, వార్డు మెంబర్లు కె. అప్పారావు, దాసి పరదేశినాయుడు, చొప్పా నూకాలు, ఎలిశెట్టి జగదీష్, కె. జోగినాయుడు, కరకపాటి రాము, మూర్తి మహేష్, జల్లూరి అప్పారావు తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 30 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో చెట్లను నరికి పట్టుకుపోయారని వాపోయారు. అటవీ ప్రాంతానికి చెందిన అకేషియా చెట్ల తరలింపునకు ఎటువంటి అనుమతులు లేకుండా వందలాది ట్రాక్టర్లపై నరికి పట్టుకుపోతున్నారని, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. క్వారీ లీజు దారుడు వెనుక అధికార పార్టీ నాయకులు అండ ఉండటంతోనే అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కలప తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్ లక్ష్మిని వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. డిప్యూటీ తహసీల్దార్ మురళిని వివరణ కోరగా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



ట్రాక్టర్లలో తరలిస్తున్న అకేషియా కలప

పెదబొడ్డేపల్లిలో భారీ చోరీ

14 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి శ్రీరామనగర్ కాలనీలో భారీ చోరీ జరిగింది. విద్యుత్ లైన్‌మన్ కాళ్ల రాంజీ ఇంటి తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి బీరువాలో ఉంచిన 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు ఎత్తుకుపోయారు. బాధితుడు కథనం ప్రకారం.. శ్రీరామనగర్‌లో నివాసముంటున్న రాంజీ రోలుగుంట మండలం కొండపాలెం లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. రాత్రి 10 గంటల వరకు ఇంట్లో గడిపి, పడుకునేందుకు అక్కడ సమీపంలో అత్తవారింటికి భార్యా పిల్లలతో వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి తలుపు గడియ విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. దీనికి ముందు పక్క పోర్షన్‌లో నివాసం ఉంటున్న వారు బయటకు రాకుండా తలుపు గడియ పెట్టారు. తర్వాత బాధిత ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు విరగ్గొట్టి, అందులోని మూడు తులాలు మంగళ సూత్రాలు, ఐదు ఉంగరాలు, ఆరు చైన్లు, మూడు తులాల హారం, తులం నెక్లెస్, తులం చెవిదిద్దులు, తులం బ్రాస్‌లైట్ మొత్తం 14 తులాల ఆభరణాలతో పాటు రూ.10 వేలు పట్టుకుపోయారు. విధులకు వెళ్లేందుకు ఉదయం వచ్చి చూసేసరికి తలుపు గడియ విరగ్గొట్టేసి ఉండటం చూసి షాక్‌కు గురయ్యాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బట్టలు, వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో నగలు, డబ్బు లేకపోవడంతో బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గోవిందరావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు అనకాపల్లి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.



క్లూస్ టీం వేలిముద్రల సేకరణ

జీడిమామిడి, టేకు తోటల దగ్ధం

మాకవరపాలెం: అగ్ని ప్రమాదంలో కాలిపోయిన జీడి, టేకు తోటలను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన పోతల గోవింద, దుంగల లక్ష్మి, దుంగల సత్తిబాబుతోపాటు మరికొంత మందికి చెందిన సుమారు ఆరెకరాల్లో జీడిమామిడి, టేకు తోటలు శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తూ కాలిపోయాయి. దీనిపై రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో ఆర్ఐ జెట్టి, వీఆర్వో కుమారి కాలిపోయిన తోటలను పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకుని, ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



కాలిన పంటను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

75 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితులకు రిమాండ్

రోలుగుంట: మండలంలో కొంతలం- వడిప గ్రామాల మార్గమధ్యంలో అక్రమంగా నిల్వ ఉంచిన 75 కిలోల గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామకృష్ణారావు వివరాల ప్రకారం.. మండలంలో లువ్వసింగు గ్రామానికి చెందిన కొర్రా నవీన్‌తోపాటు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ మండలం పూరణటిక్ పోదూర్ గ్రామానికి చెందిన ఖిలా సోమనాథ్ కొంతలం- వడిప గ్రామాల మధ్య జీడితోటలో 75 కిలోల గంజాయి నిల్వ ఉంచారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం రావడంతో దాడులు చేశారు. గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని కొనుగోలు చేసి తిరుపతిలో విక్రయించడానికి సిద్ధమవుతుండగా పట్టుబడ్డారు. దీని విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి డిగ్రీ విద్యార్థుల క్రీడా పోటీలు

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థుల క్రీడా పోటీలు వేడుకగా ముగిశాయి. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ప్రారంభించిన ఈ పోటీలు శుక్ర, శనివారాల్లో జరిగాయి. క్రికెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ, చోడవరం ఉషోదయ డిగ్రీ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్‌లో విద్యార్థి కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు, ఖోఖోలో ప్రభుత్వ కళాశాల, ఉషోదయ కళాశాల మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్నాయి. వంద మీటర్ల పరుగు పందెంలో ఎస్.గాయత్రి ప్రథమ, జి.మోహిని, ఆర్.మానస ద్వితీయ స్థానాల్లో, బాలురు పరుగు పోటీలో బి.శివ, జి.సాయిదుర్గ, ఇ. మనీష్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేత విద్యార్థులను ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి. సత్యవతి, ఎస్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు సిబ్బంది అభినందించారు.



విజేత విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది

25లోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

కొత్తపెంటలో పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

దేవరాపల్లి: జిల్లాలోని రైతులంతా ఈ నెల 25లోగా రిజిస్ట్రీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహన్ రావు సూచించారు. మండలంలోని కొత్తపెంట రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను శనివారం ఆయన పర్యవేక్షించారు. మండలంలోని ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ఎంత మేర పూర్తయిందని ఏవో వై. కాంతమ్మను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ కోసం ప్రతీ రైతు ఆధార్, భూమి వన్‌బీ కాపీ, ఆధార్ లింక్‌తో ఉన్న ఫోన్ పట్టుకొని సమీప రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తయిన రైతుకు ఐడీ నెంబర్ వస్తుందన్నారు. ఐడీ నెంబర్ ఉన్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ రాయితీలు, పంటల బీమా, బ్యాంక్ లోన్లు, యంత్ర పరికరాలు తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా రిజిస్ట్రీ ప్రక్రియను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

ఏఎస్ పేట గ్రామ సచివాలయంలో చోరీ

కంప్యూటర్, 3 ఇన్వర్టర్ బ్యాటరీల తస్కరణ

కశింకోట: మండలంలో ఏఎస్ పేట గ్రామ సచివాలయంలో కంప్యూటర్ చోరీకి గురైంది. శుక్రవారం రాత్రి ఆగంతకులు సచివాలయ భవనం వెనుక భాగం తలుపులను బలంగా నెట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. అక్కడ ఉన్న కంప్యూటర్ సహా మూడు ఇన్వర్టర్ బ్యాటరీలను తస్కరించుకుపోయారు. ఉదయం సిబ్బంది సచివాలయానికి వెళ్లినప్పటికి లోపల వైపు గడియ వేసి మూసిన తలుపులు తెరచి ఉండటం, కంప్యూటర్, బ్యాటరీలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సత్యారావు శనివారం తెలిపారు. వీటి ఖరీదు రూ.75 వేలు ఉంటుందన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి కత్తితో వీరంగం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లికి చెందిన మతి స్థిమితం లేని వ్యక్తి శనివారం మునగపాకలో కత్తితో వీరంగం సృష్టించాడు. దీంతో పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురయ్యారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వాడ్రాపల్లికి చెందిన మతి స్థిమితం లేని వ్యక్తి మునగపాకలో చేపల అమ్మకందారులకు అడపాదడపా సాయం చేస్తుంటాడు. ఈ క్రమంలో కత్తితో హల్‌చల్ చేశాడు. సమాచారం మేరకు మునగపాక పోలీసులు అతడిని పట్టుకుని కత్తి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించడంతో వారు వచ్చి అతడిని అక్కడ నుంచి తీసుకెళ్లిపోయారు.

క్లుప్తంగా

వజ్ర కవచధర గోవిందా..



కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణ

కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలమాలలు, తులసీ మాలల అలంకరణతో కనువిందు చేశారు. మాఘ మాసం శనివారం పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణ చేశారు. విష్ణు సహస్ర నామాలతో అర్చించి పూజించారు. నక్షత్ర హారతితో మంగళం పలికారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు.

రేపు అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశు చెప్పారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ తక్షణమే జీవో విడుదల చేయాలని ఆమె కోరారు.

హుండీ లెక్కింపు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ నెల రెండు, మూడు శనివారాలకు కలిపి లెక్కించగా రూ.2,060 వచ్చినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కోన నాగ వెంకట సురేష్ తెలిపారు.

భద్రత.. మన బాధ్యత

కశింకోట: హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ లక్ష్మణరావు ద్విచక్ర వాహన చోదకులను కోరారు. కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం ప్రాంతాల్లో వాహనాల తనిఖీ శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. హెల్మెట్ ప్రమాదాల్లో ప్రాణాపాయానికి గురి కాకుండా తలకు రక్షణగా నిలుస్తుందన్నారు. అలాగే కార్లలో సీటు బెల్టులు ధరించి ప్రమాదాలకు గురి కాకుండా రక్షణ పొందాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 7,590 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,790	4,820
మొదటి రకం	3,540	4,250
రెండో రకం	3,230	3,720
మూడోరకం	3,000	3,220

అనకాపల్లి సినిమాలు

ఇట్స్ కాంప్లికేటెడ్	:రాజా
ఆరెంజ్	:సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1(మ్యాట్నీ, 1.2 షోలు)
కెప్టెన్ అమెరికాతెలుగు వెర్షన్	:సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
సూర్య కృష్ణన్	:వెంకటేశ్వర(ఉదయం)
తల	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1.2 షోలు)
లైలా	:శ్రీసత్య
బ్రహ్మానందం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 48 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు , బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-32 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చును.

జీడి, మామిడికి మంచు దెబ్బ



రాలిపోతున్న పూత.. విజృంభిస్తున్న తెగుళ్లు

అనకాపల్లి: వాతావరణ మార్పుల కారణంగా కొద్ది రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో మామిడి, జీడి పంటలకు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం చెట్లన్నీ నిండా పూతతో ఉన్నాయి. ఇటువంటి తరుణంలో మంచు విపరీతంగా కురుస్తుండడంతో పూత రాలిపోవడడంతో పాటు తెగుళ్లు విజృంభిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి మండలంలో మామిడి 296 ఎకరాలు, జీడి 611 ఎకరాలు, కశింకోట మండలంలో మామిడి 1256 ఎకరాలు, జీడి 2165 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. సాధారణంగా డిసెంబర్ మొదటి వారం నుంచే మామిడి, జీడి చెట్లకు పూత వస్తుంటుంది. ఆ నెలలో వర్షాలు పడడంతో పూత రావడం కొంత ఆలస్యం జరిగింది. జనవరి నుంచి పూత పూయడం ప్రారంభించింది. మామిడిలో రసాలు, పనుకులు, సువర్ణరేఖ రకాలకు సంబంధించి పూత వచ్చింది. మరికొన్ని రకాలు పూతకు వచ్చే దశలో ఉన్నాయి. వర్షాల కారణంగా కొంత పూత రాలిపోయింది. దీనికి తోడు తేనె మంచు పురుగు సోకి పూత నాశనం అవుతోంది. అంత్రోక్నోజ్ అనే మచ్చ తెగులు కూడా సోకినట్లు రైతులు చెబుతున్నారు. తోటల్లో కలుపు ఎక్కువగా ఉండడంతో చాలా ప్రాంతాల్లో ఈ తెగళ్లు శరవేగంగా వ్యాపిస్తున్నాయి.

- మామిడిలో తేనె మంచు పురుగు ప్రభావం వలన ఆకులు, కొమ్మలు, రెమ్మలు గోధుమ రంగులోకి మారి ఎండిపోతాయి. కీటకాలు తేనె బంకను ఉధృతం చేస్తాయి.
- తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పూలు, పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీని వలన పూత, పిందె, పాడి రాలిపోతాయి. పురుగులు విసర్జించిన తేనె లాంటి తియ్యని పదార్థంపై శిలీంధ్రాలు పెరుగుతాయి.
- ఆకులు, పూత, కాయలపై నల్లని మసి రంగు ఏర్పడుతుంది. జనవరి నుంచి మార్చి వరకూ లేత ఆకులపై పూరెమ్మలపై తెగుళ్లు జీవిస్తాయి.
- పురుగులు కాయలేని సమయంలో చెట్ల కాండం, కొమ్మల బెరడులోని పగుళ్లలో దాక్కుంటాయి. వాతావరణం మబ్బుగా ఉండి గాలిలో తేమశాతం ఎక్కువగాను, ఉష్ణోగ్రత తక్కువగాను ఉండినప్పుడు ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. పురుగుల వలన 20 నుంచి 100 శాతం నష్టం జరుగుతుంది.
- జీడి మామిడిలో సకాలంలో ఎరువులు వాడకం, కొమ్మ కత్తిరింపు వంటి యాజమాన్య పద్ధతులు అవలంబించకపోవడం, 'టీ దోమకు' పంట ఎక్కువగా గురికావడం, పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకపోవడం వంటి కారకాల వల్ల దిగుబడి తగ్గుతుంది. జీడిమామిడిలో ప్రధానంగా తేయాకు టీ దోమ వలన చాలా వరకూ నష్టం కలుగుతుంది.
- తేయాకు దోమ, ఇతర ఆకు, కాయ తేనె పురుగులను నివారించవచ్చు. 8 దఫాలుగా సస్యరక్షణ మందులు పిచికారీ చేయాలి.
- పూత మాడు తెగులు బైట్ సాధారణంగా పుష్ప గుచ్ఛాలు, ఎదుగుతున్న కొమ్మలను ఆశిస్తుంది. తెగులు ఆశించిన పుష్పగుచ్ఛాలు మాడి రాలిపోతున్నాయి. ఎదుగుతున్న గింజలు మెత్తబడి పూర్తిగా ఎదగక రాలిపోతాయి. తెగుళ్ల నివారణ కోసం రైతులు పూత మందు వాడాలి.



అనకాపల్లి మండలం గోపాలపురంలో మామిడి చెట్టుకు పూత రాలిపోతున్న దృశ్యం

సకాలంలో మందులు పిచికారీ చేయాలి



మంచు కారణంగా మామిడిలో తామర, కాయ తొలుచు పురుగు, ఆకు మచ్చ, బూడిద తెగుళ్లు ఆశిస్తాయి. జీడి తోటలకు టీ దోమ, ఎరసల్లి కాండం తొలుచు పురుగు, పూత మాడు తెగులు ఆశిస్తాయి. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నియంత్రించడానికి పురుగు మందులతోపాటు పోషకాలు కూడా అందించాలి. మామిడి తోటలకు లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 5 గ్రాముల యూరియా కలిపి కొమ్మలన్నీ తడిచేలా పిచికారీ చేయాలి. బోరాన్ లోపం ఉన్నట్లయితే లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున బోరాన్ కలిపి పిచికారీ చేయాలి. జీడి తోటల్లో పూతమాడు తెగులు నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము ఎస్‌ఫిట్ లేదా కార్బన్‌డైజేషన్ కలిపి చెట్టు మొత్తం తడిసేలా పిచికారీ చేయాలి. –ఎ.ప్రవీణలక్ష్మి, ఉద్యానవనశాఖ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అధికారి, అనకాపల్లి

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం



గుండాల జంక్షన్ ప్రాంతంలో ప్రచారం నిర్వహించిన పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ

అనకాపల్లి టౌన్: తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతానని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి చెప్పారు. గుండాల వీధి తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గతంలో ఇతర ఉపాధ్యాయ సంఘాల నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సమస్యలను పక్కన పెట్టి అప్పటి ప్రభుత్వాలతో అంట కాగి ఉపాధ్యాయ హక్కులను తాకట్టు పెట్టారని విమర్శించారు. యూటీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహగిరిపై స్వచ్ఛ ఆంధ్ర

సింహాచలం : సింహగిరిపై శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్ద దేవాలయ వైదికులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సింహగిరిపై మాడవీధులు, దేవాలయం పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలనే దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పారాయణధారులు, డీఈ హరి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పెంటర్ల సంఘం నూతన కార్యవర్గం



మహాశివరాత్రి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

అనకాపల్లి: కార్పెంటర్ల సంఘం పట్టణ అధ్యక్షునిగా కోరుకొండ వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద శనివారం జరిగిన ఎన్నికల్లో సంఘం ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారిగా తుంపాల సతీష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు మాట్లాడుతూ కొత్త కమిటీ రెండు సంవత్సరాలు పదవిలో ఉంటుందని, వీరబ్రహ్మేంద్రస్వామి 31వ ఆరాధన, మహాశివరాత్రి మహోత్సవాలు ఈనెల 26న ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవాన్ని పట్టణంలో పురవీధుల గుండా నిర్వహిస్తామని, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణం జరుగుతుందని చెప్పారు. అంతకుముందు మహాశివరాత్రి కరపత్రాలను నూతన కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మధరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామచంద్రమ్మ పండగ



దలాయిపాలెంలో కొలువుదీరిన శ్రీ రామచంద్రమ్మ అమ్మవారు

పరవాడ: వాడచీపురుపల్లి శివారు గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా భావించే శ్రీ రామచంద్రమ్మ అమ్మవారి జాతరను ఈ నెల 16, 17, 18న ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. పండగను పురస్కరించుకుని దలాయిపాలెంలోని రామచంద్రమ్మ ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వాడచీపురుపల్లి గ్రామంలో రంగు రంగుల విద్యుత్ తోరణాలతో పురవీధులను అలంకరిస్తున్నారు. సంతబయలు, మెయిన్ రోడ్డులో భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉత్తరాంధ్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు, 17న జిల్లా స్థాయి కోలాట పోటీలు, 18న ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు చొప్పున బహుమతులు అందజేస్తారు. ఈ నెల 18న మంగళవారం వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. పండగ రోజున గ్రామ పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు తెలిపారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి : స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నివేదన చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీకోదండ సీతారాముల వారి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. గత 7 రోజులుగా హరే రామ హరే కృష్ణ దివ్యనామ సప్తాహం నిర్విరామంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటాన రాము, పార్టీ సీనియర్ నాయుకులు బోకం రామునాయుడు, రాపేటి రాము, భీశెట్టి వెంకటరావు, బి.మహాలక్ష్మి నాయుడు, బోను గంగునాయుడు, మళ్ల బాలాజీ, చిరికి దేముడు పాల్గొన్నారు.

- అదేవిధంగా ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, సర్పంచ్ దాడి లావణ్య, కన్నంనాయుడు, నాయుకులు యడ్ల నాయుడు, అప్పికొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



నూకాంబిక ఆలయం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రమాణం చేస్తున్న సిబ్బంది



అక్కిరెడ్డి పాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న పంచాయతీ సిబ్బంది



తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల: ఇల్లు, పరిసరాలతో పాటు పనిచేసే కార్యాలయాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్వో వై.సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరు కార్యాలయంలో శనివారం ఉదయం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితోపాటు ఆయన పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. వ్యర్థాలను పోగు చేసి బూడిద చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందితో కలిసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

ఇది అందరి బాధ్యత

అనకాపల్లి టౌన్: ప్రతి ఒక్కరూ ఇంటిని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇది అందరి బాధ్యత అని నూకాంబిక ఆలయ ఈవో ఎస్.సుజాత పేర్కొన్నారు. గవరపాలెం నూకాంబిక ఆలయ పరిసర ప్రాంతంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజు పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించాలన్నారు. ఆలయ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. సచివాలయం వద్ద మొక్కలను నాటారు. అగ్రికల్చర్ ఏడీ రామారావు, సర్పంచ్ సాలాపు శాంతి, సూరి అప్పారావు, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు. తుమ్మపాల పీహెచ్‌సీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు వారి గదులు, బీరువాలు, టాయిలెట్స్, ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. డాక్టర్ ఎన్.వాణి జగదీశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ, స్టాఫ్ నర్స్ పార్వతి, యూడీసీ హరి, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



క్లస్టర్ కాంప్లెక్స్‌లో డీఈవో ప్రేమ్‌కుమార్



గుల్లేపల్లిలో విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈవో అప్పారావు నాయుడు, తదితరులు



మల్లునాయిడుపాలెంలో వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు, తదితరులు

సబ్బవరం : విద్యార్థులంతా కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. మండలంలోని మల్లునాయుడుపాలెంలోని బీసీ బాలుర వసతి గృహంతోపాటు గుల్లేపల్లిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు పరీక్షలకు సిద్ధమవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు అంటే భయం లేకుండా ఇప్పటి వరకూ పాఠశాలలో రాసిన పరీక్షలన్నీ రివిజన్ చేసుకోవాలన్నారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. సాధనతో ఏదైనా సాధ్యమవుతుందన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు ఇక్కడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్జెక్టు పరంగా ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయుల సాయంతో నివృత్తి చేసుకోవాలన్నారు. పిల్లలు చదువుకునేటప్పుడు తల్లిదండ్రులు టీవీ పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.సాంబమూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

పెందుర్తి : రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళిక ప్రకారం ప్రతీ ఉపాధ్యాయుడు ప్రతీ విద్యార్థిని పర్యవేక్షించాలని సూచించారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ కమిషనర్ పలు అంశాలను సూచించారు. మండల విద్యాశాఖాధికారి – 2 మధుమూర్తి, హెచ్‌ఎం చొప్పర చిన్నమ్మాయి, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

చక్కని బోధనతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



ఉపాధ్యాయులు, ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్

అనకాపల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు బోధన చేయాలని అనకాపల్లి మండలం ఇన్‌చార్జ్ ఎంఈవో-1 దివాకర్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక హైస్కూల్లో శనివారం ఆర్పీలు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయని, వినూత్న బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, కల్యాణ అక్షింతలను అర్చకులు అందజేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

పెందుర్తి : సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి వారి ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేషాలంకరణలో స్వామి పూజలందుకున్నారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.